


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 159 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 13 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :159 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 13 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## మండలిలో మాటల యుద్ధం..

### బొత్స, మంత్రి పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు!

- ఏపీ శాసనమండలిలో సంక్షేమ పథకాలపై తీవ్ర వాగ్వాదం
- ప్రభుత్వ వాదనలు అబద్ధమని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని బొత్స సవాల్
- బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఏ శిక్షకైనా సిద్ధమని మంత్రి పార్థసారథి ప్రతిసవాల్
- అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపై ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం
- పింఛన్ల తొలగింపు ఆరోపణలపై వివరణ ఇచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సమావేశాలు గురువారం అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదాలతో దద్దరిల్లాయి. సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ, టీడీపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభా వాతావరణం వేడెక్కింది. గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రూ.20,000 ఇచ్చినట్లు చెప్పడం పూర్తిగా అవాస్తవమని బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ప్రభుత్వం చెప్పింది నిజమని నిరూపిస్తే తాను బహిరంగంగా క్షమాపణ చెప్పడానికి సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే క్రమంలో 'వసతి దీవెన' నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని, ప్రైవేటు ఆసుపత్రులు 'ఆరోగ్యశ్రీ'ని నిరాకరిస్తున్నాయని, 'తల్లికి వందనం' సక్రమంగా అందడం లేదని విమర్శించారు. "మేం సభను తప్పుదోవ పట్టించడం లేదు.

- మిగతా2లో

## ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు

# నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం

- పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసనమండలిలో వాడీవేడి చర్చ
- విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూములిచ్చామన్న మంత్రి లోకేశ్
- విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ
- ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని వైసీపీకి హితవు
- పారిశ్రామికవేత్తల నుంచి కప్ టీ, కేక్ తప్ప ఏమీ తీసుకోలేదని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**"నాపై విమర్శలు చేయాలనుకుంటే ఒక్క విషయంలో చేయవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్‌ను కలిసినప్పుడు ఆయన బాంబే హౌస్‌లో ఒక కప్పు టీ ఇచ్చారు. దావోస్‌లో నా పుట్టినరోజున కాగ్నిజెంట్ వారు ఒక కేక్ ఇచ్చారు. అంతకుమించి మేం లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక కప్పు టీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకున్నట్లు నిరూపిస్తే ఏ చర్యకైనా సిద్ధం" అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వైసీపీకి సవాల్ విసిరారు. పరిశ్రమలకు భూముల కేటాయింపుల్లో ఎలాంటి అవినీతికి తావులేదని, తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యం యువతకు ఉద్యోగాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు. శాసనమండలిలో వైసీపీ సభ్యుల ఆరోపణలకు ఆయన ఈ విధంగా ధీటుగా బదులిచ్చారు.

**మండలిలో భూ కేటాయింపులపై వాడీవేడి చర్చ**

శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో పరిశ్రమలకు 99 పైసలకే భూముల కేటాయింపు అంశంపై వాడీవేడి చర్చ జరిగింది. గత 20 నెలల్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, కుదుర్చుకున్న ఒప్పందాలు (ఎంవోయూలు), వాటి ధరల వివరాలపై వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు ప్రశ్నలు లేవనెత్తారు. విశాఖలో కోట్ల రూపాయల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు 99 పైసలకే ఎలా ఇస్తారని వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై మంత్రి లోకేశ్ సమగ్రంగా సమాధానమిచ్చారు.

**విశ్వసనీయత ఉన్న 5 కంపెనీలకే 99 పైసలకు భూమి**

- మిగతా2లో



## పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

### కొలికపూడికి పల్లా వార్నింగ్

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారశైలిపై విమర్శలు
- అసెంబ్లీ లాబీలో కొలికపూడితో మాట్లాడిన పల్లా శ్రీనివాస్
- పార్టీతోనే గుర్తింపు, వ్యక్తిగతంగా జీరో అని గుర్తించాలంటూ హితవు

**పెన్ పవర్ డెస్క్:**తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఇటీవల విమర్శలు వస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో పల్లా సమావేశమయ్యారు.

- మిగతా2లో

## రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

### సభలో ఎంపీ నోటీసు

- అమెరికాతో భారత్ ట్రేడ్ డీల్ పై రాహుల్ ఆరోపణలు
- నరవణె బుక్ పై మాట్లాడకుండా అడ్డుకుంటోందని ప్రభుత్వంపై విమర్శలు
- దేశాన్ని అమ్మేశారన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీల ఆగ్రహం

- మిగతా2లో



## 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

**పెన్ పవర్ డెస్క్:**పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఇటీవల చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అయితే, రావల్పిండిలోని జైల్లో ఉన్న ఆయన పట్ల అక్కడి

- మిగతా2లో





## అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- సరైన రవాణా సదుపాయం లేని గ్రామాలకు ప్రాణదాతలుగా డ్రోన్లు
- 20 నిమిషాల్లోపే అత్యవసర మందుల సరఫరా
- రెడ్ వింగ్ సంస్థతో కలిసి ఏపీ ప్రభుత్వం సరికొత్త సేవలు

**పెన్ పవర్ డెస్క్:**గిరిజన ప్రాంతాల్లోని పేదలకు ఆధునిక వైద్య సేవలను చేరువ చేసే దిశగా సరికొత్త సాంకేతిక విప్లవానికి ఏపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'సంజీవని' మెడికల్

- మిగతా2లో

## తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై

# భూమన ఆరోపణలు

- తిరుపతి లడ్డూ నెయ్యి సరఫరాపై సీఎం చంద్రబాబును ప్రశ్నించిన భూమన
- గతంలో హెరిటేజ్ సంస్థ రూ. 278కే నెయ్యి సరఫరా చేసిందని వెల్లడి
- ఇప్పుడు అదే సంస్థ రూ. 658కి సరఫరా చేయడంపై తీవ్ర ఆరోపణలు
- ధరల వ్యత్యాసం, నాణ్యతపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యి ధర, నాణ్యత విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. టీటీడీ మాజీ ఛైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. గతంలో 2014-19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఆయన కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్ తయారీ యూనిట్ అయిన ఇందాపూర్ ఫుడ్స్ అండ్

- మిగతా2లో



## కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని కేసు నమోదు
- ఈ నెల 14న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన కోవూరు పోలీసులు
- మైనింగ్ కేసులో ఇప్పటికే బెయిల్ పై బయట ఉన్న కాకాణి

**పెన్ పవర్ డెస్క్:**గత కొన్ని రోజులుగా వైసీపీ నేతలకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ల అరెస్టులు, రిమాండ్లు అందరికీ తెలిసిందే. ఇప్పుడు మరో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంతు వచ్చింది.

- మిగతా2లో






## విద్యార్థులకు మూడవ తరగతి నుంచి అందుబాటులోకి 'ఏఐ'

- విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందన్న కేంద్ర మంత్రి
- పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఏఐని అందుబాటులోకి తెస్తామన్న మంత్రి
- కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందన్న ధర్మేంద్ర ప్రధాన్

కృత్రిమ మేధస్సు (ఏఐ) విధానాన్ని భారతదేశంలోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్య సహా అన్ని రంగాల్లో ఏఐ విస్తరిస్తోందని అన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి విద్యార్థుల నుంచి ఆధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు కృత్రిమ మేధను అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.ఢిల్లీలో జరిగిన ఏఐ-కాంక్లేవ్-2026 సదస్సులో పాల్గొన్న ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, కృత్రిమ మేధ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన వద్ద మేధో సామర్థ్యానికి లోటు లేదన్నారు. కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏఐకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను సృష్టించడంలో సాంకేతిక సంస్థలు నిమగ్నమయ్యాయని అన్నారు.

## ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

- వివిధ విమానాశ్రయాల అభివృద్ధి పనులకు సంబంధించి చర్చ
- మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడి
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ముఖ్యమంత్రి

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడుపుతున్నారు. ఈరోజు ఆయన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# కార్యకర్తలను విస్మరిస్తున్న పార్టీలు

రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆ పార్టీ కార్యకర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయనేది నిర్వివాద అంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తలపట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈ విషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం, వైయస్ఆర్, కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణ (భారత) రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో గత 17 నెలలనుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ ఫలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుదీర్ఘ కాలంనుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబంధిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగామారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసుల్లో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాథుడే లేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబంధిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్లపాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు.

కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరానివారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసిన వారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎంఎల్ఎ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు.

మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కోసం కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్థి విజయానికి కష్టపడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరంలేని శాసనసభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసనమండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీలకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వవచ్చు. కానీ ఇప్పటి వరకు ఏ పార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎంఎల్ఎ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్యసభలో స్థానం కల్పించాయా? కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఏ పార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగా చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామస్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎంఎల్ఎ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న, చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది.

ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత, సలహాదారులపై ఎక్కువగా ఆధారపడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్రస్థాయిలో పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడం ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటుపాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒకవేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తిచూపితే ఆ కార్యకర్త బతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తిచూపిన కార్యకర్త దశాబ్దాలు పాటూ పార్టీ కోసం కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్‌బిన్‌లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్థి పార్టీల నేతలను తిట్టే వారికి, భజనపరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామస్థాయిలో ప్రజలకు తెలియచేసేది. అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ అవసరాల కోసం చేసే విమర్శలకు క్షేత్రస్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందు వలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుదీర్ఘ కాలం పాటు వరుసగా అధికారంలో ఉండలేకున్నాయి అనేది నిర్వివాదాంశం.

# ఒక కప్పు టీ కంటే ఎక్కువ తీసుకున్నట్టు నిరూపిస్తే ఏ చర్చకైనా సిద్ధం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో కేవలం ఐదు విశ్వసనీయమైన (క్రెడిబులిటీ) కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఒజూ), కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు మాత్రమే ఈ ధరకు భూములు ఇచ్చామన్నారు. ఈ ఐదు కంపెనీల ద్వారా రాష్ట్రంలో సుమారు 65,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని వివరించారు. ఉదాహరణకు, కాగ్నిజెంట్ మొదట 8,000 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, భూమిపూజ సమయంలో ఆ సంఖ్యను 25,000కు పెంచిందని గుర్తుచేశారు.

**ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నదే వైసీపీ లక్ష్యం**

వైసీపీ తీరుపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీకి పరిశ్రమలు రాకూడదని, పెట్టుబడులను తరిమేయాలనే ఏకైక లక్ష్యంతో వైసీపీ పనిచేస్తోందని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచిందని, అమర్ రాజా వంటి సంస్థను రాష్ట్రం నుంచి తరిమేశారని విమర్శించారు. తాము 17 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థను రాష్ట్రానికి తీసుకొచ్చామని, దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రలో రాబోతోందని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ సభ్యులు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

**హైదరాబాద్ మోడల్‌ను విశాఖలో పునరావృతం చేస్తాం**

విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ లేదని, దాన్ని నిర్మించడానికే ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయిస్తోందని లోకేశ్ వివరించారు. 1994-2004 మధ్య చంద్రబాబు హైదరాబాద్‌లో ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలకు తక్కువ ధరకే భూములు ఇవ్వడం వల్లే నేడు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారిందన్నారు. గుజరాత్‌లో టాటా నానో ఫ్యాక్టరీకి అప్పటి సీఎం నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇచ్చి మొత్తం ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విశాఖను ఐటీ, జీసీసీ హబ్‌గా మార్చాలనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు.

**ఆరోపణలు నిరూపించలేక వైసీపీ వాకౌట్**

చర్చ సందర్భంగా, అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి ప్రభుత్వం భూములు కట్టబెట్టాలని చూస్తోందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. ఈ ఆరోపణను మంత్రి లోకేశ్ తీవ్రంగా ఖండించారు. తాము కేవలం ఐదు కంపెనీలకే 99 పైసలకు భూములు ఇచ్చామని, ఆరో కంపెనీ అయిన ఉర్సాకు భూములు కేటాయించినట్లు ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, బొత్స సత్యనారాయణ నేతృత్వంలో నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

**విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలే మా లక్ష్యం**

విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ..

తమ ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. 2029 నాటికి ఒక్క విశాఖలోనే ఐటీ రంగంలో 5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఒక ఐటీ ఉద్యోగం ద్వారా పరోక్షంగా మరో ఐదారుగురికి ఉపాధి లభిస్తుందని, దీనివల్ల విశాఖ ఆర్థిక వ్యవస్థకు ఏటా 10 బిలియన్ డాలర్ల మేర మేలు జరుగుతుందని వివరించారు. ప్రభుత్వానికి రెండు రూపాయల ఆదాయం తగ్గినా పర్వాలేదు కానీ, యువతకు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రతిపక్ష ఆరోపణలు సత్యదూరం**

వైసీపీ సభ్యులు సత్యదూరమైన మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేక పారిపోవడం వారికి అలవాటేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. భూముల కేటాయింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, కేబినెట్ ఆమోదం తర్వాతే కేటాయింపులు చేస్తున్నామని తెలిపారు. క్లస్టర్ విధానంలో పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని, ప్రతి పరిశ్రమ గ్రౌండింగ్ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు

# రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలి..

లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్ సభలో బీజేపీ ఓ నోటీసును ఫైల్ చేసినట్లు సమాచారం. అయితే, రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేయలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా బుధవారం రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రసంగించిన విషయం తెలిసిందే.రాహుల్ తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్రం అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుందని, ప్రధాని మోదీ దేశాన్ని అమెరికాకు అమ్మేశాడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్ లో చైనా ఆక్రమణ విషయం స్పష్టంగా ఉందని, ఆ విషయంపై సభలో మాట్లాడకుండా అధికార పక్షం తనను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.ఈ ప్రసంగంపై కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు సభలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రేడ్ డీల్ తో భారత్ కు ఎలాంటి నష్టం లేదని వివరించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ నోటీసు ఇచ్చారు.

# పార్టీ లైన్ దాటితే చూస్తూ ఊరుకోబోం..

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా పార్టీతోనే ఆయనకు గుర్తింపు వచ్చిందని, వ్యక్తిగతంగా ఆయన జీరో అనే విషయాన్ని గుర్తించాలంటూ పల్లా శ్రీనివాస్ హితవు పలికారు. అది గుర్తించి నడుచుకోవాలని సూచించారు.పార్టీ లైన్ దాటితే ఉపేక్షించబోమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను కొలికపూడికి తెలియజేశారు. వాట్సప్ స్టేటస్ లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా ఆయనను నిలదీశారు. మందలించినా కూడా పద్ధతి మార్చుకోకుంటే పార్టీ ఆయనను ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని స్పష్టం చేశారు. కాగా, అనుభవరాహిత్యం వల్లే పొరపాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని ఆయన కోరారు.

# మండలిలో మాటల యుద్ధం..

- మొదటి పేజి తరువాయి

అధికార పక్షం మా ఆరోపణలు తప్పని రుజువు చేస్తే, మా మాటలు వెనక్కి తీసుకుని సారీ చెబుతాం" అని బొత్స స్పష్టం చేశారు. అలాగే గత 19 నెలల్లో 60 ఏళ్లు నిండిన వారికి ఎన్ని కొత్త పింఛన్లు ఇచ్చారని, తాము పెట్టిన అర్హత నిబంధనలను ఏమైనా మార్చారా అని ప్రభుత్వాన్ని నిలదీశారు.బొత్స ఆరోపణలకు మంత్రి కొలుసు పార్థసారథి అంతే దీటుగా స్పందించారు. బొత్స సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. 'తల్లికి వందనం' నిధులు నియోజకవర్గాలు, జిల్లాల వారీగా పంపిణీ చేసినట్లు పత్రాలతో సహా నిరూపిస్తామని, ఒకవేళ రుజువు చేయలేకపోతే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రతిసవాల్ విసిరారు. 'అన్నదాత సుఖీభవ' కింద 48 లక్షల మందికి లబ్ధి చేకూరితే, "ఒక్కరికీ పడలేదు" అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. "నేను ఛాలెంజ్ చేస్తున్నా. రండి చెక్ చేద్దాం" అంటూ బొత్సను చర్చకు ఆహ్వానించారు.

ఈ చర్చలో పింఛన్ల అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 20 నెలల్లో

ఒక్క పింఛనూ తొలగించలేదని స్పష్టం చేశారు. 4.7 లక్షల మరణాల కారణంగా 2.7 లక్షల పింఛన్లు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 63.2 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని వివరణ ఇచ్చారు. మొత్తం మీద, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఇరుపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో మండలిలో రాజకీయ వేడి కొనసాగుతోంది.

# 85% కంటిచూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

- మొదటి పేజి తరువాయి

సిబ్బంది అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సమాచారం. జైలు గదిలో సుదీర్ఘకాలంగా ఒంటరిగా ఉంచడంతో ఆయన కంటి చూపు కోల్పోతున్నారని, ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తోందని తెలిసింది. ఈ మేరకు సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన సుప్రీం కోర్టు, వెంటనే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది.

మూడు, నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకగా కనిపించడం మొదలైందని న్యాయవాదితో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దాంతో పరిస్థితి విషమించి పూర్తిగా కంటిచూపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని న్యాయవాదికి వివరించారు. ప్రస్తుతం తన కుడికన్ను 85 శాతం చూపు కోల్పోయినట్లు చెప్పారు.

**'కామరూప' పిశాచి.. ఎవరీ జెఫ్రీ ఎప్‌స్టీన్?**

ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లో ఏకాంతంగా ఉంచడంతోపాటు ఆయనకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని, కుటుంబీకులను కూడా కలవకుండా జైలు అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే కోర్టు నియమించిన అమికస్ క్యూరీ.. జైల్లో ఉన్న ఇమ్రాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను వివరిస్తూ కోర్టుకు నివేదిక సమర్పించారు. రెండున్నరేళ్లుగా ఒంటరిగా గదిలో ఉంచారని, దీంతో మానసికంగా, శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు.

# అడవుల్లోని గిరిజన గ్రామాలకు 'సంజీవని' డ్రోన్లు.. ఏపీలో సరికొత్త వైద్య సేవలు!

- మొదటి పేజి తరువాయి

డ్రోన్ల పైలట్ ప్రాజెక్టును అల్లూరి సీతారామరాజు జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. వాగులు, వంకలు, కొండలు, కోనలు దాటుకుని ఆసుపత్రులకు వెళ్లే గిరిజన గ్రామాల ప్రజలకు ఇప్పుడు ఈ డ్రోన్లు ప్రాణదాతలుగా మారాయి. అల్లూరి జిల్లాలోని 2,191 గిరిజన గ్రామాలకు సరైన రవాణా సదుపాయాలు లేకపోవడంతో... అత్యవసర పరిస్థితుల్లో రోగులను, గర్భిణులను డోలీల ద్వారా కిలోమీటర్ల దూరం మోసుకెళ్లడం జరుగుతోంది. ఈ ప్రయాణంలో జరిగే ఆలస్యం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థతో కలిసి డ్రోన్ల సేవలను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది.

ఆసుపత్రులకు వెళ్లడానికి గంటల సమయం పట్టే ప్రాంతాలకు కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే అత్యవసర మందులను డ్రోన్లు అందజేస్తాయి. ఇవి సాధారణ డ్రోన్ల మాదిరి కాకుండా... శాటిలైట్ ట్రాకింగ్ తో ఆటోమేటెడ్ సాఫ్ట్ వేర్ తో పనిచేస్తాయి. 5 కేజీల బరువున్న మెడిసిన్స్, వ్యాక్సిన్స్, బ్లడ్ ప్యాకెట్స్, పాము కాటు మందులను చేరవేయడమే కాకుండా, అక్కడి రోగుల రక్త నమూనాలను పరీక్షల కోసం తిరిగి ఆసుపత్రికి తీసుకొస్తాయి. దీనివల్ల సకాలంలో వైద్యులు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. పాడేరు డిగ్రీ కాలేజీని ప్రధాన హబ్ గా చేసుకుని ఈ డ్రోన్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి బిజీబిజీ..

- మొదటి పేజి తరువాయి

వివిధ విమానాశ్రయాల అభివద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు.వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఈ క్రమంలో తదుపరి పనులు చేపట్టాలని కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి కోరారు. కొత్తగూడెం విమానాశ్రయానికి సంబంధించి పాల్వంచలో స్థలం గుర్తించామని తెలిపారు. ఓఎల్ఎస్ సర్వే, ఫీజబిలిటీ స్టడీ నిర్వహించాలని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి, అదనంగా 249.82 ఎకరాలు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కూడా కలిశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ముఖ్యమంత్రి నిన్న రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తదితరులతో భేటీ అయ్యారు.

# తిరుపతి లడ్డూ నెయ్యి: చంద్రబాబుపై భూమన ఆరోపణలు

- మొదటి పేజి తరువాయి

డెయిరీ ప్రొడక్ట్స్.. టీటీడీకి కేజీ నెయ్యిని రూ. 278 నుంచి రూ. 306 ధరలకే సరఫరా చేసిందని భూమన గుర్తుచేశారు. రూ. 300 లోపు నాణ్యమైన నెయ్యి ఎలా వస్తుందని ఇప్పుడు ప్రశ్నిస్తున్న చంద్రబాబు, ఆనాడు సరఫరా చేసిన నెయ్యి నాణ్యతపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆశ్చర్యకరంగా, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక మళ్లీ అదే యూనిట్ సరఫరాదారుగా వచ్చి, ఇప్పుడు కేజీ నెయ్యిని ఏకంగా రూ. 658కి సరఫరా చేస్తోందని భూమన ఆరోపించారు. చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెరిటేజ్ తయారీ యూనిట్, కర్ణాటకకు చెందిన మరో సంస్థతో కలిసి టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తోందని తెలిపారు.

గతంలో రూ. 278కి సరఫరా చేసినప్పుడు నాణ్యమైనదిగా భావించి, ఇప్పుడు ధరను రూ. 658కి ఎలా పెంచారని.. దీని వెనుక ఏదైనా వ్యాపార ఒప్పందం ఉందా అని సీఎం సమాధానం చెప్పాలని భూమన నిలదీశారు. గతంలో చంద్రబాబు హయాంలో ఈ రెండు యూనిట్లు 40 లక్షల కేజీలకు పైగా నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని, దీనిపై ఆయన వివరణ ఇవ్వాలని భూమన డిమాండ్ చేశారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి రిమాండ్

మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో రిమాండ్ పడింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కేసులో గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో, 2023 జనవరిలో అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో బెయిల్ లభించగా, గతేడాది మెడికల్ కాలేజీ అంశంపై నిర్వహించిన ఆందోళనల్లో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న కేసులోనూ ఆయనకు బెయిల్ లభించింది. ఈ రెండు కేసుల్లో బెయిల్ రావడంతో అంబటి విడుదల కావడం లాంఛనమేనని అందరూ అనుకున్నారు. అయితే, పోలీసులు సంక్రాంతి లక్కీ డ్రా కేసులో పీటీ వారెంట్ పై కోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో అంబటికి నిరాశే మిగిలింది. తాజా రిమాండ్‌తో ఆయన విడుదల ఆగిపోయింది.

# కాకాణికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఆయనకు నెల్లూరు జిల్లా కోవూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుమ్మలదిన్నెలో బాలిక మృతిపై నిరాధార ఆరోపణలు చేశారని, ఈ నెల 14న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. నెల్లూరులోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. నోటీసులపై కాకాణి ఇంకా స్పందించాల్సి ఉంది.

మరోవైపు, నెల్లూరు జిల్లాలో జరిగిన అక్రమ మైనింగ్ కేసులో కాకాణి ఇప్పటికే జైలుకు వెళ్లిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. బెయిల్ పై బయటకు వచ్చినప్పటి నుంచి ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని మరింత పెంచారు.

# సమన్వయంతో స్వచ్ఛ సర్వేక్షణ సర్వే చేపట్టాలి

**- కమీషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు**





**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు ఫిబ్రవరి 12**

స్వచ్ఛ సర్వేక్షణ సర్వేను విజయవంతం చేయడానికి ప్రతి సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ సర్వేకు సంబంధించిన ఒకరోజు సామర్థ్య వికాస శిక్షణ కార్యక్రమం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉండాలని వారు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే లో ఈ సంవత్సరం మన ఒంగోలు నగరం మంచి ర్యాంక్ సాధించటానికి ప్రతి ఒక్కరూ పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జయ మాధురిమ యెండ్లూరి పాల్గొని, స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలు, అమలు విధానం, ఫీల్డ్ స్థాయి డేటా సేకరణ, పౌర భాగస్వామ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, శుభ్రత ప్రమాణాలు సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ప్రాక్టికల్ అంశాలు, ఫీల్డ్ అమలు చర్యలు, నివేదికల సమర్పణ విధానం గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో అవగాహన పెరిగి, స్వచ్ఛ సర్వేక్షణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ఎం. వైష్ణవి, శానిటరీ సూపర్వైజర్ నూక తోటి పిచ్చయ్య మాట్లాడుతూ, పట్టణ పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం, వ్యర్థాల వేరు చేయడం, ఆరోగ్య పరిరక్షణ అంశాలలో సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు. శిక్షణలో పొందిన మార్గదర్శకాలను ఫీల్డ్ స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వ్యవహరించి శిక్షణ అందించింది. ఈ కార్యక్రమంలో చీమకుర్తి కమీషనర్ రామకృష్ణ , శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాల సిబ్బంది, మెప్మా ఆర్పీ లు, ఇతర మునిసిపల్ సిబ్బంది హాజరై శిక్షణ పొందారు.

# పెన్ పవర్

MARKAPURAM మార్కాపురం

## మార్కాపురం - ప్రకాశం

### గిద్దలూరు నియోజకవర్గ

# అభివృద్ధికి ఎల్లవేళలా అండదండలుంటాయి

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**వేసవిలో నీటి సమస్యను పరిష్కరిస్తాం**

**డోంట్వరి అశోక్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**డిప్యూటీ సీఎంపవన్ కళ్యాణ్ ని కలిసిన**

**గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల**



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

అమరావతి వెలగపూడి సచివాలయంలో గిద్దలూరు తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డిప్యూటీ ఏపీ పవన్ కళ్యాణ్ ను మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్లో కలిసి కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయనకు దృష్టికి తీసుకెళ్లి వివరించి అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయమని కోరారు. ముఖ్యంగా 15వ తేదీన వచ్చే శివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతంలో ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వస్తున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి సమస్య తలెత్తకుండా గిద్దలూరు నియోజకవర్గనికి నిధులు కేటాయించి, ట్యాంకర్ల ద్వారా అవసరమైన ప్రదేశాలలో నీటిని తరలించి ప్రజలకు అందించేందుకు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి తెలిపారు.

# కాశిరెడ్డికుంటకు మహర్దశ పట్టనుందా

**అభివృద్ధికి రూ. 2కోట్లు మంజూరు**

**మరో రూ.2కోట్లకు ప్రతిపాదనలు**

**ఫలిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కృషి**

**వైసీపీ ప్రభుత్వంలో తూతూమంత్రంగా జరిగిన కట్ట పనులు**

**గత ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్న వ్యాయమా పరికరాలు**



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

గిద్దలూరు పట్టణంలోని నరవ రోడ్డు లోని కాశిరెడ్డికుంటకు మహర్దశ పట్టనుంది. కుంటను అభివృద్ధి చేసి కుంట చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు, చిన్నపిల్లల పార్కు కుంట కట్టపై ఏర్పాటు చేసేందుకు పూడికతీత పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి బీపీఎస్, ఎస్ఆర్ ఎస్ నిధుల నుంచి రూ. 2కోట్లు మంజూరు చేయించారు. ఈ మొత్తం కుంట అభివృద్ధికి సరిపోదని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడంతో మరో రూ. 2 కోట్ల నిధులు మంజూరుకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదనంగా కావలసిన రూ. 2కోట్ల నిధులకు సంబందించి పనుల ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. ఈలోగా మంజూరైన నిధులకు సంబంధించి ముందుగా ఏఏ పనులు చేయాలి అనే విషయంపై ఇంజనీరింగ్ అధికారులు డీపీఆర్ ను తయారు చేస్తున్నారు. డీపీఆర్ చివరి దశలో ఉండగా ఇది పూర్తయితే అంచనాల ఆమోదం తీసుకుని టెండర్కు వెళ్తుంది. ఈలోగా రెండోసారి పంపించిన రూ. 2కోట్ల ప్రతిపాదనలకు కూడా నిధులు మంజూరయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తం రూ. 4 కోట్లు మంజూరైతే ఇప్పటికే పూడిపోయి ఉన్న కాశిరెడ్డికుంటలో నీటిని మొత్తం తోడివేసి పూర్తిగా పూడికతీత పనులు చేపట్టి కుంట చుట్టు వాకింగ్ ట్రాక్, ఒక వైపు చిన్నపిల్లల పార్కు, ట్రాక్పై చెట్ల పెంపకం, బెంచీల ఏర్పాటు, ఎక్సర్సైజ్ చేసుకునే పరికరాల ఏర్పాటు చేస్తారు. కుంట చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించి వాకింగ్ ట్రాక్కు ఇబ్బంది లేకుండా చేస్తారు. గిద్దలూరు పట్టణంలో ఇప్పటి వరకు ఎక్కడా వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్ల మార్జిన్లలో వాకింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పనులు కార్యరూపం దాల్చితే పట్టణవాసులకు మంచి వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రానున్నది. కాశిరెడ్డికుంట అభివృద్ధిపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి నిధుల మంజూరుపై ప్రత్యేకంగా శ్రద్ధచూపుతున్నారు.

**తూతూమంత్రంగా పనులు**

గత వైసీపీ పాలనలో కాశిరెడ్డికుంట అభివృద్ధికి స్వచ్ఛ ఆంధ్ర పథకం కింద కొంతమేర నిధులు మంజూరయ్యాయి. అప్పటి కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా కొద్దిమేర పనులు చేసి అర్ధాంతరంగా పనులను నిలిపివేశారు. కొన్ని జిమ్ పరికరాలను పనులు పూర్తికాక ముం దే కుంటపై ఏర్పాటు చేయగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. కుంట స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాంపౌండ్ వాల్ నిర్మించడం కొంతలో కొంత మేలు చేసింది. చేసిన పనులు కూడా నాసిరకంగా ఉండటమ్ తో పలువురు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు పనుల ను తనిఖీ చేశారు. మొత్తం మీద పనులన్నీ ఆగిపోవడంతో ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే కుంట అభివృద్ధి పై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి ఇప్పటికే రూ. 2కోట్లు మంజూరు చేయించి మరో రూ. 2కోట్ల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తు న్నారు. కుంట నీటి మధ్యలో జాతీయ పతాకాన్ని రెపరెప లాడించేం దుకు వీలుగా ప్రత్యేకంగా డిజైన్ చేయిస్తున్నారు. మొత్తమ్మీద కాశిరెడ్డి కుంటకు మహర్దశ పట్టనుంది.

# పర్యాటక కేంద్రంగా పాకల బీచ్

**- శాఖల సమన్వయంతో అద్భుతంగా 14,15న బీచ్ ఫెస్టివల్ నిర్వహణ - జిల్లా కలెక్టర్ పి రాజ బాబు**





**ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

పాకల బీచ్ ఫెస్టివల్ ఈనెల 14 15 నిర్వహిస్తున్నట్లు ఈ బీచ్ ఫెస్టివల్ తో పాకల సముద్ర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు అన్నారు గురువారం ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 14,15 తేదీల్లో జరిగే పాకల బీచ్ ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు.

**సాగర హారతి :** మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవంలో పురోహితుల వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో సముద్ర హారతి కార్యక్రమం ఉంటుందని అన్నారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు :**

ప్రత్యేక కార్నివాల్ తో పాటు కొమ్ము కొయ్య, తప్పెట గుళ్ళు, ధింసా, కాళిక, పులి వేషాలు వంటి వివిధ రకాల నృత్య ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. వినోద కార్యక్రమాలు : ప్రముఖ టీవీ యాంకర్ సుమ, జబర్దస్త్, ఆర్కెస్ట్రా బృందం వారు నిర్వహించే వినోద కార్యక్రమాలు బీట్ ఫెస్టివల్ కు వచ్చే ప్రజలకు అలరిస్తాయని చెప్పారు. సైకత శిల్పం: స్వర్ణాంధ్ర 2047 ఇతివృత్తంతో పాటు మహా శివుని భారీ సైకత శిల్పాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. క్రాకర్ షో : సముద్ర తీరంలో మరిన్ని కాంతి వెలుగులు నింపేలా క్రాకర్స్ షో వుంటుందని,

ఆసక్తి ఉన్నవారు వినియోగించుకునేలా, సందర్శకులలో సరికొత్త అనుభూతిని నింపేలా హెలీటూరిజంను అందుబాటులోకి తెస్తున్నామ న్నారు. ప్రత్యేక ఆకర్షణ కోసం గుర్రాలు, ఒంటెల ప్రదర్శన కూడా ఉంటుందని తెలిపారు.

**వాటర్ స్పోర్ట్స్ - బీచ్ స్పోర్ట్స్ :** సముద్రంలో స్పీడ్ బోట్ రైడింగ్, జెట్ రైడింగ్ చేసే అవకాశం వస్తుందని, బీచ్ వాలీ బాల్, బీచ్ కబడ్డీ వంటి ఆటలు వుంటాయని, అవసరానికి ఉపయోగించు కునేలా 50 మంది గజ ఈతగాళ్ళను సిద్ధంగా ఉంచుతున్నామని అన్నారు. ఫుడ్ కోర్ట్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు, వివిధ రాష్ట్రాలలో ప్రసిద్ధి చెందిన ఆహార రుచులను సందర్శకులకు అందుబాటులో ఉంచేలా ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, ఆహార పదార్థాల నాణ్యతను ఎప్పటి కప్పుడు పరిశీలించేందుకు ఫుడ్ ఇన్స్పెక్టర్ కు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ రూమ్స్: జిల్లా కేంద్రం లో 1077 నెంబరుతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాకలలో ఈ కింది 6 నెంబర్లతో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9281034469, 9281034470, 9281034471, 9281034473, 9181034491, 9281034492 అత్యవసర పరిస్థితుల్లో పై సంప్రదించాలని కోరారు. ప్రత్యేక గుర్తింపు పొందిన ఉత్పత్తులను, ప్రజలను ఆకట్టుకునే వివిధ రకాల వస్తువలను ప్రదర్శించేలా, విక్రయించేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సందర్శకులకు, విఐపి లకు అన్ని ఏర్పాట్లు పెద్ద ఎత్తున వచ్చే సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాలతో పాటు ఫుడ్ కోర్ట్ లు, స్పోర్ట్స్ జోన్స్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక వద్ద, ఈ వేడుకలకు ప్రవేశ మార్గాల వద్ద పారిశుద్ధ్యం కోసం తడిచెత్త, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించేలా ప్రత్యేకంగా డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఫుడ్ కోర్ట్, టాయిలెట్ల వద్ద హ్యాండ్ వాషింగ్ స్టేషన్లు, సానిటైజర్ డిస్పెంసర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సందర్శకుల కోసం స్థానికంగా ఉన్న టాయిలెట్ల తో పాటు 75 ఎకో ఫ్రెండ్లీ మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నామని, విఐపి లకు, దివ్యాంగులకు వేరువేరుగా ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు శుద్ధమైన తాగు నీటిని అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు స్థానికంగా చేపట్టామని, దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్లు కూడా అందుబాటులో వుంచుతున్నామని అన్నారు. ఈ ఉత్సవంలో ఒక ప్రధాన మెడికల్ క్యాంప్ తో పాటు వివిధ ఈవెంట్ల వద్ద మినీ మెడికల్ క్యాంప్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అడ్వాన్స్డ్ లైఫ్ ఎక్విప్మెంట్, మందులతో కూడిన అంబులెన్స్ లను అందుబాటులో వుంచుతున్నామని, అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, రద్దీ ప్రదేశాలలో అగ్నిమాపక పరికరాలను, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పటిష్ట బందోబస్తు : పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, విఐపి, వివిఐపిలు ఈ ఉత్సవంలో పాల్గొంటున్నందున జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ సిబ్బందితో పాటు ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యకర్తల సేవలను కూడా వినియోగించుకుంటునట్లు చెప్పారు. అవసరమైన ప్రదేశాలలో సిసిటివీ ల ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పలు కార్యక్రమాలు చేపట్టిన కొమరోలు పోలీసులు

**మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

**ఆదేశాల మేరకు రోడ్ల కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు, మైకు ప్రచారాలు**




**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు మార్కాపురం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కొమరోలు ఎస్ఐ నాగ రాజు ఆధ్వర్యంలో పోలీసులు అనేక రకాల ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, వాటి వలన కలిగే ప్రాణం నష్టాలు, కుటుంబాలకు కలిగే ఆర్థిక ఇబ్బందులు తదితర వాటిని ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు వివరించి వారిని అప్రమత్తం చేసేందుకు వీలుగా కొమరోలు ఎస్సై నాగరాజు మార్కాపురం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇటీవల అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొమరోలు, తాటిచెర్ల మోటు, ఇడమకల్లు క్రాస్ రోడ్డు కూడలి , తోపాటు రోడ్ల మార్జిన్లలో రోడ్డు ప్రమాదాలను ,వాటి వలన కలిగే కష్టనష్టాలను , తెలియజేసే సంఘటనల ఫోటోలతో ముద్రించిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు పోలీసుల ,రోడ్డు నిబంధనలను పాటిస్తూ, వాహనాలను పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కార్లు తదితర వాహనాలు నడిపే డ్రైవర్లు ,డ్రైవర్ సీట్ పక్కన కూర్చున్న ప్రయాణికులు షీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనదారులు, ప్రయాణికులకు ,రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించి వారిని మరింత అప్రమత్తం చేసేందుకు కొమరోలు ఎస్ఐ నాగరాజు రూపొందించిన మైకు ప్రసారాన్ని పోలీసులు ఆటోలలో ఏర్పాటు చేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అజ్ఞాత వ్యక్తుల సంచారాన్ని గమనిస్తూ పోలీసులకు సమాచారం అందించాలని, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అపరిచిత వ్యక్తులకు టీపీలు చెప్పడం, వారు పెట్టిన మెసేజ్ల లింకులను ఓపెన్ చేయటం లాంటి చేయరాదని, మద్యం సేవిస్తూ వాహనాలు నడపవద్దని హెచ్చరిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసుల ప్రచారాలను ప్రజలు ఆసక్తిగా వింటున్నారు.

# హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించాలి

## – ఉద్యోగులకు సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ ఏ.మురళీకృష్ణ యాదవ్ సూచన





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

ఉద్యోగులు హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించాలని సీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ ఏ.మురళీకృష్ణ యాదవ్ అన్నారు. 1104 ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఒంగోలులోని 1104 యూనియన్ ప్రాంతీయ శాఖ కార్యాలయంలో యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మురళీకృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యుత్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ, సంస్థకు కార్మికులే కీలకమని వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. సంస్థకు పెద్ద సంఖ్యలో సిబ్బంది, వనరులు ఉన్నా ఇంకా కొన్ని అంశాల్లో వెనుకబడి ఉన్నామని దీనిని అధిగమించడానికి సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఎంతో కీలకమైనదని కొద్ది సేపు విద్యుత్ కు అంతరాయం కలిగినా మనం భరించలేమని దీనిని దృష్టిలో పెట్టుకుని మనం మరింత అప్రమత్తంగా సమర్ధంగా మన విధులను నిర్వర్తించాలన్నారు. ప్రజలకు ఎంతో విలువైన సేవలు అందించే ఈ శాఖలో ఉద్యోగం చేయడం మనందరి అదృష్టమన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు సీనియర్లను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. సీనియర్లు కూడా అన్ని విషయాలను జూనియర్లకు అర్థం అయ్యే విధంగా చెప్పాలన్నారు. కీలక సమయాల్లో మన పనితీరు మన సమర్థతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. తుఫానులు, కొత్త కాలనీల ఏర్పాటు ఇలా ఏదైనా ముందు వచ్చే మాట విద్యుత్ ఉందా అని దీనిని సంస్థలోని కార్మికులు గుర్తించి పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. కార్మికులకు రావాల్సిన ప్రయోజనాల గురించి యాజమాన్యంతో మాట్లాడి మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అలాగే, కార్మికులు కూడా వినియోగదారులకు మంచి నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీడీసీఎల్ ప్రకాశం సర్కిల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు డివిజన్ డీఈ హరిబాబు, డిస్కమ్ సెక్రటరీ ఎన్.శర్మ, రీజనల్ సెక్రటరీ ఆర్.సంజీవరావు లు కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బి.సురేష్, యు.రవిశంకర్, ఏ.వి.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ఎస్ ఐ గా రాజేష్

**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 12**




పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ గా సూ రెడ్డి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం నాడు తన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పొదిలి ఎస్సైగా పనిచేసిన యు. వేమన ఒక వివాద స్పద కారణము వల్ల మార్కాపురం పట్టణానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం పొదిలి ఎస్ ఐ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన రాజేష్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతుల పరిరక్షణకు గట్టి కృషి చేస్తానని చెప్పారు. అలాగే మండల పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న వాటిని కఠినంగా అణిచివేస్తామని ఆయన హెచ్చరించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న, వాటిని ప్రజలు తమ దృష్టికి తీసుకుని రావాలని రాజేష్ కోరారు.

# సమీర్ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న షేక్ నాయబ్ రసూల్ (బడే)



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ పాచ్చామియా కుమారుడు షేక్ సమీర్ నిశ్చితార్థ వేడుకలు పామూరులోని అనిల్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సాంప్రదాయ పద్ధతుల్లో నిశ్చితార్థ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమమునకు టిడిపి సీనియర్ నాయకులు షేక్ నాయబ్ రసూల్ (బడే), చంద్రపూర్ (మహారాష్ట్ర) హాజరై సమీర్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షేక్ పాచ్చామియా కు అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో షేక్ నాయబ్ రసూల్ టీచర్ , కోవిలంపాడు సర్పంచ్ షేక్ ఖాదర్ బీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# శివ స్వాములకు ఉచిత మెడికల్ క్యాంపు



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 12**

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మార్కాపూర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు శివ స్వాములకు అటకేశ్వరం దగ్గర ఉచితంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సాయి రోహిత్ హాస్పిటల్ డాక్టర్ సి.సాయి కిరణ్ రెడ్డి, సి.వసంతకుమారి 5000 , మాగులూరి రామకృష్ణ అండ్ సన్స్ 5000, మారం రెడ్డి రామకృష్ణారెడ్డి (కిట్టు )2000, భూపానీ కాశయ్య (లాయర్ )1000 రూపాయలను అందజేసి సహకరించినట్లు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం మిర్జాపేట గ్రామంలో కూడా మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. గురువారం శ్రీశైలం నడిచి వెళ్లే శివ భక్తులకి శివ స్వాములకు మెడిసిన్స్ అందించే సేవాభాగ్యం మాకు కల్పించినందుకు దాతలకి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అన్నారాము, డాక్టర్ కనకదుర్గ, గంగిశెట్టి కిరణ్, నారాయణ, వెంకటేష్, తడికమల్ల శివప్రసాద్ ,పవన్, కంచర్ల చెన్నకృష్ణ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి ఋణ మంజూరు, రికవరీ వేగవంతం చేయాలి

## స్త్రీనిధి జిల్లా ఏ.జీ.ఎం ఉదయ్ కుమార్

**గిద్దలూరు పెన్ పవర్, ఫిబ్రవరి12**

స్వయం సహాయక బృందాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడంలో,తిరిగి రికవరీ శాతం పెంచే ప్రక్రియను వెలుగు క్షేత్ర స్థాయి సిబ్బంది, వివోఏలు వేగవంతం చేయాలని స్త్రీనిధి జిల్లా ఏ.జి.ఎం ఉదయ్ కుమార్ అన్నారు. రాచర్ల వెలుగు మండల మహిళా సమాఖ్యలో సిబ్బందికి,వివోఎలకు గురువారం సమీక్ష నిర్వహించారు. రాచర్ల మండలంలో స్త్రీనిధి రుణాల లక్ష్యం 8 కోట్లు కాగా, ఇప్పటిదాకా 4కోట్లు దాటిందన్నారు. రుణ రికవరీ రేటును పెంచడం ద్వారా ఆయా గ్రామ సంఘాల పరిధిలో రుణ అర్హత సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎన్.పి.ఏ,ఓవర్ డ్యూ ఉన్న ఎస్.హెచ్.జిల సభ్యుల నుంచి రికవరీ సాధించడంలో వివోఏలు కృషి చేయాలన్నారు.సభ్యురాళ్ళు రుణాలు పొంది జీవనోపాధుల ద్వారా ఆదాయ వనరులు పెంచుకునేలా చూడాలన్నారు.మార్చి 27 కల్లా లక్ష్యాన్ని అధిగమించేలా చూడాలన్నారు. ఏ.పీ.ఎం కొత్తిమీర నరేష్ మాట్లాడుతూ అజీవిక డేటా నమోదు, వి.పి.ఆర్పీ సర్వే, పి.ఎం.ఎఫ్.ఎమ్.ఇ రుణాల మంజూరు పనుల్లో ప్రగతిని సాధించాలని కోరారు. సమీక్షలో స్త్రీనిధి మేనేజర్ రాజేశ్వరి, మండల



సమాఖ్య అధ్యక్షురాలు దండు విజయలక్ష్మి,క్లస్టర్ సి.సిలు ఎన్.కృష్ణయ్య, పి. వెంకటయ్య, అకౌంటెంట్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్–అక్షరాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన జేసి



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 12**

స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉల్లాస్ – అక్షరాంధ్ర పోస్టర్ ను జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెప్మా, డ్వామా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్య అధికారులకు సూచించారు. మార్కాపురం జిల్లాలో 66,972 మంది నిరక్ష్య రాస్యులను గుర్తించినట్లు మార్కాపురం జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి వి. ప్రభాకర్, సూపర్వైజర్ చెన్నయ్య లు జెసికి వివరించారు. వీరికి పదిమందికి ఒకరు చొప్పున వాలంటీర్లను తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అల్లినగరం హై స్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసిన పూర్వ విద్యార్థులు

*టెన్త్ పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులతో అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్ష.*

*శుభాకాంక్షలు ,ఆశీస్సులు అందజేసిన 2008 -2009 బ్యాచ్ పూర్వ విద్యార్థులు.*

*పూర్వ విద్యార్థులను అభినందించిన పాఠశాల హెచ్ఎం మామిడి పద్మజ, ఉపాధ్యాయులు.*






**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

కొమరోలు మండలం అల్లినగరంలో గల మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులతో పాటు అన్ని తరగతుల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ చేసి శు భాకాంక్షలు తెలిపారు. అల్లినగరం హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసుకుని వివిధ స్థాయిలలో స్థిరపడ్డ 2008 2009 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం అల్లినగరం హై స్కూల్ కి వెళ్లి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులకు, మిగిలిన విద్యార్థులకు తాము ప్రోత్సాహకరంగా ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేసేందుకు వచ్చామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజకు వివరించారు. అందుకు స్పందించి, హర్షం వ్యక్తం చేసిన ప్రధానోపాధ్యాయురాలు పూర్వ విద్యార్థుల ఔదార్యాన్ని అభినందిస్తూ వారిని సదరంగా ఆహ్వానించారు. ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ, ఆశీర్వదించారు .ఆ మేరకు విద్యార్థులు, హెచ్ఎం పద్మజ ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల నిర్ణయాన్ని, వారి సేవ, ఔదార్యాన్ని స్వాగతిస్తూ అభినందించారు . తమ భవిష్యత్తుకు గట్టి పునాదులు వేసి తీర్చిదిద్దిన పాఠశాల పై ఉన్న మమకారం ,కృతజ్ఞతా భావంతో తమ తమ్ముళ్లు, చెల్లెలు లాంటి విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేస్తున్నట్లుగా పూర్వ విద్యార్థుల పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్ రాజు, హరి కుమార చౌదరి, పిచ్చయ్య ,శివరాం, చంద్ర మోహన్, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, బోధనేతర సిబ్బంది పకీరయ్య, అశ్వినీ దేవి, టెన్త్ విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 12**

మహాశివరాత్రి పర్వదిన పురస్కరించుకొని మండల పరిధిలోని బోడే నాయక్ తాండ సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద శ్రీశైలం వెళ్లే పెద్ద బొమ్మలాపురం గ్రామస్తులు దాతల సహకారంతో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదాన కార్యక్రమం మూడు రోజులపాటు పెద్ద బొమ్మలాపురం గ్రామస్తులు మరియు దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. భారీ సంఖ్యల పాల్గొని భక్తులు అన్నదానం కార్యక్రమం లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వహించడం జరిగింది.

# సమీర్ నిశ్చితార్థ వేడుకలో కదిరి పార్థసారధి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ పాచ్చామియ కుమారుడు షేక్ సమీర్ నిశ్చితార్థ వేడుక గురువారం పామూరులోని అనిల్ గార్డెన్ లో జరిగింది.ఈ వేడుకలో కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్థసారధి హాజరై సమీర్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, తీకెనం బాబురావు, నున్నా నారాయణ, షేక్ నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె

**దొనకొండ ఫిబ్రవరి 12 పెన్ పవర్**

దొనకొండ లో సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా స్కీం వర్కర్లు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ ఆశాలు మిడ్ డే వర్కర్స్ వీఎవో సివిల్ సప్లై ముఠా పంచాయతీ మరియు బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మె ర్యాలీ దొనకొండ బస్టాండ్ నుండి తహసిల్దార్ ఆఫీస్ వద్ద వరకు ర్యాలీగా చేరింది. తహసిల్దార్ కార్యాలయం వద్ద అనేక రకమైన డిమాండ్ లతో గంటసేపు నినాదాలు జరిగినది. జయప్రదం చేయండి దేశభక్తి వ్యాప్త వ్యతిరేకించండి బిజెపి కేంద్ర ప్రభుత్వ కార్మిక ఉద్యోగ ప్రజావ్యతిరేక విధానాల్లో కార్మికులు పెద్ద ఎత్తున విధానాలు చేశారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ నాగార్జున రెడ్డి కి డిమాండ్ తో కూడిన వినతి పత్రాలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిఐటియు దొనకొండ మండల కన్వీనర్ చిరుపల్లి అంజయ్య వ్యవసాయ కార్మిక సభ అధ్యక్షులు కర్ణ హనుమయ్య కార్యదర్శి



కుందుర్తి చిన్న నరసింహులు కోల కిరణ్ కుమార్ బాలకోటయ్య కొండా దాసు వెంకటస్వామి ఆదాము తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేనికి అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారం

**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీలోని హసనాపురం గ్రామానికి చెందిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ కు మరో అరుదైన పురస్కారం లభించింది. వెంకటేశ్వర్లు యాదవ్ తాను స్థాపించిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా గత మూడు దశాబ్దాలుగా అనేక సేవా కార్యక్రమాలను గిద్దలూరు నియోజకవర్గం తో పాటు అనేక జిల్లాల స్థాయిలో అమ్మ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ,పేద, నిరుపేదలు, వికలాంగులు, విద్యార్థులకు, అనాధలకు తమ సేవలను అందించి ఆదుకుంటున్నది దీనితో గతంలో హైదరాబాద్ నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు యాదవ్కు డాక్టరేట్ అవార్డు అందించి అభినందించారు. అనేక స్వచ్ఛంద సేవ సంస్థలు సైతం వెంకటేశ్వర్లు యాదవ్ స్థాపించిన అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డులు అందించి అభినందించారు. కాగా ఈనెల 11వ తేదీ బుధవారం విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛంద సామాజిక ఆచార్య కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేశ్వర్లు యాదవ్కు అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారం అందించి అభినందించారు .ఆ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ అమ్మ ఫౌండేషన్ ద్వారా గత మూడు దశాబ్దాలుగా అందించిన సేవా కార్యక్రమాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేస్తూ పేద నిరుపేద బలహీన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనాధలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు కోరారు. ఆ కార్యక్రమంలో మథర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం



ప్రసాద్ రావు ,హనుమంతరాయ గ్రంథాలయం గాంధీనగర్ విజయవాడ పేరం శివనాగేశ్వరరావు, మల్లాడి ప్రసాదరావు, హీరోయిన్ ఉప్పలపాటి సంధ్య ,సత్తెనపల్లి బుల్లిబాబు ,దొడ్డపాటి దాస్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా స్వాతంత్ర సమరయోధుల పేరున అల్లూరి సీతారామరాజు జాతీయ అవార్డు వెంకటేశ్వర్లు యాదవ్ అందుకున్నారు .ఆ సందర్భంగా వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ ,అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారానికి తాను ఎంపిక కావడం హర్షనీయమని చెప్పారు. తనకు బాల్యం నుంచి మదర్ తెరిసా, మహాత్మా గాంధీ ,అల్లూరి సీతారామరాజు తదితర మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నానని తెలిపారు. అమ్మ ఫౌండేషన్ కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల వల్లనే అమ్మ ఫౌండేషన్కు అవార్డులు అందుతున్నాయని




పేర్కొన్నారు. అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారాన్ని అంకితం చేస్తున్నట్లుగా ప్రకటించారు.

## షేక్ సమీర్ నిశ్చితార్థ వేడుకకు హాజరైన దద్దాల



**పామూరు, పెన్ పవర్ ఫిబ్రవరి12**

కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ పాచ్చామియ , గౌసియా ల కుమారుడు షేక్ సమీర్ నిశ్చితార్థ వేడుక గురువారం పామూరు పట్టణంలోని అనిల్ గార్డెన్ లోజరిగింది. ఈ వేడుకకు కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా సమీర్ ను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసారు. వారితో పాటు కదిరి పార్థసారథి, ప్రకాశం జిల్లా టీచర్స్ విభాగం అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి, కో-ఆప్షన్ నాయబ్ రసూల్, షేక్ బారాషరీఫ్, షేక్ ఖాదర్బాషా బుజ్జి, షేక్ హాజీ, ఓకే రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి, వైభవ్ రవి, రేగలగడ్డ నాగరాజు, మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి, తికణం బాబురావు, నున్నా నారాయణ, షేక్ మీరావలి, రాచకొండ మహేంద్ర, మ్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి అధికారులతో సమావేశం



**పొన్నలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

శివరాత్రి మహోత్సవం సందర్భంగా శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయం కు సంబంధించి ఆలయ కర్త దేవాలయంకు సంబంధించిన అధికారు లతో ఎస్ఐ సత్యనారాయణ ఎమ్మార్వో పుల్లారావు ఎంపీడీవో సుజాత కలిసి సమావేశం ఏర్పాటుచేసారు. ఇందులో భాగంగా శివరాత్రి పర్వ దినం సందర్భంగా విచ్చేస్తున్న భక్తులకు సంబంధించి బందోబస్తు ఏర్పాటు గురించి తగు నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో కార్మిక సంఘాల భారీ ప్రదర్శన




**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 12**

పొదిలిలో కార్మిక సంఘాలు సమ్మె బాట పట్టాయి. కార్మికులకు అడ్డంకిగా ఉన్న లేబర్ కార్డును వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు గురువారం నాడు పొదిలిలో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించాయి. కార్మికుల ప్రదర్శనకు మద్దతుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా సంఘీభావాన్ని వ్యక్తపరిచాయి. ప్రదర్శన అనంతరం కార్మిక సంఘాలు మండల రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లి, తహసిల్దార్ కృష్ణ రెడ్డి ని కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటరత్నం తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మికి శ్రీశైలం దేవస్థానం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేసిన బోనేని దంపతులు.



**కొమరోలు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

శ్రీశైలం దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ కొమరోలు తాసిల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి కి శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు బోనేని రమణమ్మ, ఆమె భర్త కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గురువారం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ,శ్రీశైలం మల్లికార్జున స్వామి చిత్రపటం, స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందించి ఆహ్వానించారు. గురువారం కొమరోలు వచ్చిన బోనేని దంపతులు తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ భాగ్యలక్ష్మి కి ,డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య కు, పలువురు మండల స్థాయి అధికారులకు ఆహ్వాన పత్రికలు అందించి బ్రహ్మోత్సవాలు వేడుకలకు ఆహ్వానించారు. బోనేని దంపతుల ఆహ్వానానికి సంతోషం వ్యక్తం చేస్తూ, తప్పనిసరిగా బ్రహ్మోత్సవాల వేడుకలకు హాజరు కాగలమని అధికారులు తెలిపారు.

## మహాశివరాత్రి వేడుకలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

కనిగిరి డివిజనల్ అధి





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం మరియు భైరవకోన భైరవేశ్వర స్వామి దేవస్థానాల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకలను సమగ్ర కార్యాచరణ రూపొందించి పగడ్బందీగా ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కనిగిరి డివిజనల్ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆవరణలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్రాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, భక్తుల రద్దీ నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, అన్నదాన కార్యక్రమాలు సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, దేవస్థాన సిబ్బందికి సహకరించి మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశమునకు ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఎస్సై వెంకటేశ్వరా నాయక్, భైరవకోన ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కోవిలంపాడు గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, పామూరు, సి ఎస్ పురం మండలాల వివిధ శాఖల అధికారులు , ఆలయ సిబ్బంది గ్రామస్తులు హాజరయ్యారు.

## ఆపదలో ఉన్న చిన్నారికి అండగా మంత్రి గొట్టిపాటి

### మణికేశ్వరం బాలిక వైద్యానికి తక్షణ సాయం

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**

నిరుపేద కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ చిన్నారికి మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ తన ఉదారతను చాటుకున్నారు. మంత్రి చొరవతో కేవలం రెండు రోజుల వ్యవధిలోనే బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల క్రితం మంత్రి అద్దంకి మండలం, మణికేశ్వరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక తెదేపా నాయకుడు షేక్ కరిముల్లా.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన అల్లడి. ఏడుకొండలు కుమార్తె, ప్రణతి సునైన ఆరోగ్య పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాలిక శారీరక పెరుగుదల లోపంతో బాధపడుతోందని, మంగళగిరి ఎయిమ్స్ లో చికిత్స అవసరమని వివరించారు. రేషన్ కార్డులో పేరు లేకపోవడం వల్ల ఆరోగ్యశ్రీ వంటి పథకాలు వర్తించడం లేదని, ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

**అధికారులకు ఆదేశం - తక్షణ పరిష్కారం**

సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న మంత్రి గొట్టిపాటి వెంటనే స్పందించారు. బాలిక వైద్యానికి ఆటంకం కలగకూడదని, తక్షణమే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని అద్దంకి తహశీల్దార్ను



ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అద్దంకి తహశీల్దార్ శ్రీ చరణ్ గురువారం బాలిక తండ్రి ఏడుకొండలుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. దీని ద్వారా డాక్టర్ ఎన్.టి.ఆర్ వైద్య సేవ కింద బాలికకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందనుంది. తమ బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు ఇంత వేగంగా స్పందించిన మంత్రి గొట్టిపాటి. రవికుమార్ కు, సహకరించిన అధికారులకు బాలిక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, బడావలి, బలరామిరెడ్డి, పాంటింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలి



**పొన్నలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని అంగనవాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వైఎస్ సత్యవతి అన్నారు. సిఐటియు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం పొన్నలూరు బస్టాండ్ సెంటర్లో అంగనవాడీలు ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు మానవహారం చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల్లోని కార్మికులను స్కీం వర్కర్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగాలుగా నియమించి వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. నాలుగు లేబర్ కోర్సులు రద్దుచేసి, 29 కార్మిక చట్టాలను పునరుద్ధించాలన్నారు. అలాగే కార్మికులందరికీ కనీస వేతనం రూ 26 వేలు మంజూరు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. దేశంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న విధానం పై అన్ని రంగాల్లో ఉన్న కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి పోలమ్మ, మధురవాణి, పద్మ రామలక్ష్మి అంగన్వాడీలు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి పై అవగాహన కార్యక్రమం



**పొన్నలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

స్థానిక ప్రాథమిక వైద్యశాలలో గురువారం డిపిఎంఓ ధామ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటివి కుష్టు వ్యాధి లక్షణాలని తెలిపారు. అనంతరం మానవత సేవ సంస్థ వారు, డిపిఎమ్ఓ వెంకటేశ్వర్లు, ప్రగతి కుష్టు రోగులకు, దుస్తులు, నిత్య అవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు మల్లికార్జున రావు, రజిత మానస, వెంకటేశ్వర నాయక్, చిన్న అల్లూరయ్య, గౌస్ బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ను కలిసిన ఉప్పుటూరి నాగేశ్వరరావు



**కందుకూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

వైకాపా అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని కందుకూరు వైకాపా సీనియర్ నాయకులు ఉప్పుటూరి నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిని కలవడం ఆనందంగా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఆప్యాయంగా మాట్లాడారని హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో వైకాపా అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చూడాలన్నదే నా కోరిక అని అన్నారు. నాగేశ్వరరావు వెంట ఆయన సతీమణి పద్మావతి కూడా ఉన్నారు.

## శభాష్ మారుతి ..!

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 12**

ఫిబ్రవరి 2 నుంచి 7 వరకు మహర్షి దయానంద విశ్వవిద్యాలయం (రోతక్) న్యూఢిల్లీలో జాతీయస్థాయి అథలిటిక్స్ ఛాంపియన్షిప్ స్పెషల్ భారత్ ఒలంపిక్స్ లో సీనియర్ విభాగం షాట్ పుట్ నందు బంగారు పతకం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెన్నూరు విద్యార్థి వెలిది. మారుతి ప్రసన్నకుమార్ గురువారం జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మారుతిని ఆమె అభినందించి, భవిష్యత్తులో మరిన్ని పతకాలు పొందుకోవాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ ను కలిసిన వారిలో విద్యార్థి తండ్రి వెంకటేశ్వర్లు, శిక్షకుడు కోనూరి హనుమంతరావు కూడా ఉన్నారు.



# కదం తొక్కిన కార్మికులు మార్కాపురంలో రెపరెపలాడిన ఎర్ర జెండా

## పలు ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు మూత

## పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు పుర వీధుల్లో సాగిన భారీ ప్రదర్శన






**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఫిబ్రవరి 12**

అనేక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులకు తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, విజీ రామ్ జి పథకానికి తిరిగి మహాత్మా గాంధీ ఉపాధి పథకంగా మార్చాలని కోరుతూ ఏఐటియుసి, సిఐటీయూ తదితర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లాలో సార్వత్రిక సమ్మె సంపూర్ణంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి, సిఐటియు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో కార్మికులు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. దీంతో పట్టణమంతా ఎర్ర జెండాలతో రెపరెపలాడింది. పూల సుబ్బయ్య శాంతి భవన్ నుండి ప్రారంభమైన ఈ ప్రదర్శన కోర్ట్ సెంటర్, కంభం బస్టాండ్, పాత బస్టాండ్, నాయుడు బజార్, అమ్మవారి ఆలయం బజార్ మీదుగా తిరిగి కంభం బస్టాండ్ కు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున మానవ హారంగా ఏర్పడి ఆందోళన నిర్వహించారు. దీంతో మూడు వైపుల ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటియుసి నాయకులు అందే నాసరయ్య, సిఐటియు నాయకులు డి. సోమయ్య లు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరంతరం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయంగా అనేక పోరాటాల ఫలితంగా కార్మిక కార్మిక వర్గం ఎంతో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ లుగా విభజించడం దుర్మార్గమైన చర్యని వారు విమర్శించారు. ఈ లేబర్ కోడ్ లు అమలులోకి వస్తే కార్మిక వర్గమంతా యాజమాన్యానికి బానిసలుగా మారాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం నరేంద్ర మోడీకి ఎవరు ఇచ్చారని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కె కాసిం, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ సెక్రెటరీ డి. కేశవరావు, సిపిఐ నాయకులు గుండాల కాశయ్య ,చిత్తారి పెద్దన్న, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి .హరిబాబు, సిపిఎం పార్టీ నాయకులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓ .వీరారెడ్డి, బి ఎస్ ఎన్ ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎమ్.కృష్ణారావు, సలీం, అంగన్వాడీ వర్కర్స్ అసోసియేషన్,పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోవిలంపాడులో 16న రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ సోమవారం ఉదయం కోవిలంపాడు గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహానికి తోడు గ్రామీణ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి ప్రతిభావంతమైన ఎద్దుల జతలు పాల్గొనే అవకాశం ఉందని అన్నారు పోటీలలో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి స్థానం సాధించిన ఎద్దుల జతకు కోవిలంపాడు గ్రామానికి చెందిన బోయళ్ల తిరుపతి రెడ్డి, బోయళ్ల శ్రీనివాసులు రెడ్డి, బోయళ్ల భాస్కర్ రెడ్డి సహకారంతో రూ. 1,00,116 నగదు బహుమతి అందజేయనున్నారు. రెండవ స్థానం సాధించిన జతకు కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ నాయబ్ రసూల్ (బడే), మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రాపూర్, రూ. 75,000 బహుమతి ప్రకటించారు. మూడవ స్థానం సాధించిన ఎద్దుల జతకు అమడసాని బ్రదర్స్ వారు రూ. 50,000 నగదు బహుమతి అందజేయనుండగా, నాలుగవ స్థానం సాధించిన జతకు దుగ్గిరెడ్డి వెంకటాద్రి అండ్ సన్స్ వారు రూ. 30,000 లు బహుమతి ప్రకటించారు. పోటీలకు సంబంధించి పూర్తి వివరాల కోసం దొనపాటి మోహన్ రెడ్డి (9035616583), అమడసాని బాలకేశవరెడ్డి (9989100245) సోడా ఆదినారాయణ రెడ్డి (9849089371) ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేత

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా శుక్రవారం నాడు కమ్మపాలెం సబ్ స్టేషన్ నుండి వై. జంక్షన్ వరకు, ఆలూరి అపార్ట్మెంట్ తదితర ప్రాంతాలకు ఉదయం 09.00 గం. నుండి సాయంత్రం 06.00 గం. వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి. పాండురంగా రావు తెలియజేసినారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించ వలసినదిగా ఆయన కోరారు.

# 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**

కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ ఊసా రాజలక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె లో భాగంగా స్థానిక శివాలయం వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు రక్షణ గా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ ల వల్ల కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ చట్టాలు కార్మికుల సంక్షేమానికి గొడ్డలి పెట్టు లాంటిది అన్నారు. పనిగంటలు తగ్గింపు, సమాన పనికి సమాన వేతనం, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, రక్షణ తదితర సమస్యలు పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ తిరుపతి రెడ్డి, వీఆర్ఏల సంఘం నాయకుడు ఇండ్ల రామలింగయ్య, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తిరుమలమ్మ, నాగమ్మ, అంగన్వాడి నాయకులు నారాయణమ్మ, మాధవి, కార్మికులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె విజయవంతం

**పామూరు, పెన్ పవర్, ఫిబ్రవరి12**

దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగ, రైతులు విద్య సంఘాలు సంస్థలు పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మెను సిపిఐ పార్టీ మరియు ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ విజయవంతమైంది. స్థానిక పట్టణములోని సిపిఐ కార్యాలయం నుండి పలు వీధుల్లో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు, కార్మిక హక్కుల పరిరక్షణ, ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు చేతిలో కీలుబొమ్మగా మరి కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం అవుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నేతలు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా విస్తృత మద్దతుతో సార్వత్రిక సమ్మె విజయవంతమైందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహాయక కార్యదర్శి పాలపర్తి మస్తాన్ రావు , వజ్రాల సుబ్బారావు, ఆకుల మోహన్ రావు , ఇర్రి రమణారెడ్డి, సురేష్, మహేష్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# కమీషనర్ ఉదారత్వం

## చిన్నారులను అక్కునచేర్చుకొని కుర్చీలు వేసి బ్రేక్ పాస్ట్ చేయించి తన ఔదార్యాచాటుకున్నారు





**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

స్కూల్ కు వెళుతున్న ముగ్గురు చిన్నారులకు ఆకలివేసిందో ఏమో అన్నాక్యాంటీన్ రోడ్డులో వెళుతూ అన్నాక్యాంటీన్లోకి వెళ్లారు , నిర్వాహకులు చిన్నారులకు ఇడ్లి , సాంబార్ అందించారు ఆ చిన్నారులు క్యాంటీన్ లో ఓ ప్రక్క క్రింద కూర్చుని బ్రేక్ పాస్ట్ చేస్తున్నారు. అదే సమయంలో మున్సిపల్ కమిషనర్ రమణ బాబు అన్నాక్యాంటీన్ తనిఖీ చేయవచ్చి బ్రేక్ పాస్ట్ చేస్తున్నా వారిని టిఫిన్ ఎలాఉంది, రుచిగాఉందా, అని ఆరాతీస్తూ నావైపు చూడగా స్కూల్ కు వెళ్లే చిన్నారులు యూనిఫామ్ ధరించి క్రిందకూర్చుని బ్రేక్ పాస్ట్ చేస్తున్న దృశ్యం చూసి మనస్సు చలించి చిన్నారులవద్దకు వెళ్లి చిరునవ్వులు చిందిస్తూ వారిని ఆప్యాయంగా ముద్దు, ముద్దు గా పలకరిస్తూ , వారితో ముచ్చటించారు అంతటితో ఆగకుండా చిన్నారులు క్రిందకూర్చుని తింటున్నది ఓర్చుకోలేక వారికి కుర్చీలు సమకూర్చాలన్న ఆలోచనతో బయటికి వచ్చి తన అటెండరుతో చిన్న పిల్లలు కూర్చునే కుర్చీలను అప్పటి కప్పుడే తెప్పించి చిన్నారులకు వేయించి తన ఔ దార్యం చాటుకున్నారు. కమీషనర్ ఔ దార్యాన్ని చూసిన అక్కడి కస్టమర్లు కమీషనర్ ఔ దార్యానికి ముగ్ధులై కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల పట్ల కమీషనర్ చూపిన ప్రేమ ఆప్యాయతల చూపిన ఔదార్యం తో ప్రజలకు చేరువైయ్యారు . కమీషనర్ రమణ బాబు నిత్యం పట్టణ పరిధిలో పారిశుధ్యం పనులను పరిశీలిస్తూ , ప్రజలను చిరునవ్వులతో పలకరిస్తూ పారిశుధ్యం పై అవగాహన కల్పిస్తూ , పారిశుధ్యం మెరుగుపరుస్తూ ప్రజలకు ఎంత చేరువాయ్యారో , తన ఔ దార్యం చారులపట్ల చూపి అంతే చేరువ అయ్యారు. కొంగలవీడు రోడ్డులో చెత్త అందిచిన చిన్నారులను ఎట్లాగా అక్కునచేర్చుకొని ఆదరించారో చూసిన ప్రజలు ఆయనకు వారి హృదయ్యాల్లో స్టానమిస్తున్నారు. కాకుండా వేకువఝామున్నే సంబంధించిన అధికారులను వెంటపెట్టుకుని వార్డుల్లో తిరుగుతూ పారిశుధ్యం పనులను పరిశీలిస్తూ నే ప్రజాసమస్యలను తెలుసుకొని కార్యాలయం చుట్టూ త్రిప్పు కోకుండా అక్కడి కక్కడే పరిష్కారం చేస్తూ ప్రజలకు మరింత దగ్గర అయ్యారు.

# బాల బాలికల లెజిమ్స్ బృందానికి లెజిమ్స్ బహుకరణ






**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఫిబ్రవరి 12**

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాల బాలికల లెజిమ్స్ బృందానికి పాఠశాల పూర్వ విద్యార్థి షేక్. ఆయూబ్ 12 లెజిమ్స్ పరికరాలను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. శ్యామ్ ప్రసన్న పతాంజలి మరియు వ్యాయామ ఉపాధ్యాయులు పి. రామా నాయక్ , హెచ్. రామా నాయక్ దాతకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ప్రతిభ కనబరచేలా లెజిమ్స్ సాధనను క్రమబద్ధంగా వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారని తెలిపారు. లెజిమ్స్ సాధన ద్వారా క్రమశిక్షణ, సమన్వయం, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్.ఎం పి. శ్యామ్ ప్రసన్న అంజలి మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన దాత షేక్. ఆయూబ్ సహాయం అభినందనీ యమన్నారు. వ్యాయామోపాధ్యాయులు పి.రామా నాయక్ మాట్లాడుతూ అవసరాన్ని గుర్తించి వెంటనే లెజిమ్స్ అందించిన షేక్ .ఆయూబ్ దాతృత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. శ్రీమతి పి. శ్యామ్ ప్రసన్న పతాంజలి , ఫిజికల్ డైరెక్టర్లు పి.రామా నాయక్, హెచ్.రామా నాయక్, సీనియర్స్ ఉపాధ్యాయులు జి.విజయ మాణిక్యం, వి.నాగమూర్తి, ఎస్. అనసూయ దేవి, స్టాఫ్ సెక్రటరీ షేక్. రహమత్, టి. వెంకట శివ, షేక్ .అబ్దుల్ సలాం, డి. పోలయ్య, కె.కిరణ్ కుమార్, కె.మీటే నాయక్, కె. శిరీష రాణి, షేక్. మహబూబ్ బీ, ఎం.కె. మహాదేవి, కె. ఆవులయ్య, కె. ప్రసాద్ ఆర్ట్ ఎం. అనిత వర్క్ ఎడ్యుకేషన్ సయ్యద్ నాయిబ్ రసూల్ ఐ.టి టి.నరేష్ అగ్రికల్చర్ యం.కార్తీక్ ఎలక్ట్రానిక్ ఉపాధ్యాయేతర సిబ్బంది బి. సి.హెచ్. శ్రీరామ్, రామ సుబ్బారెడ్డి, డి.మధు, టి. సౌమ్య , జెడ్. సౌజన్య, ఎస్.ఎం.సి. చైర్మన్ షేక్.ఖాదర్ వలి తదితరులు పాల్గొని దాత షేక్. ఆయూబ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# చీమకుర్తిలో జాయింట్ కలెక్టర్ పర్యటన

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 12**

జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి గురువారం చీమకుర్తిలో పర్యటించారు. స్థానిక ఎం. ఎల్.ఎస్. పాయింటులోని సరుకులను పరిశీలించి వాటి నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇక్కడి నుంచి ఐదు మండలాల పరిధిలోని 170 రేషన్ దుకాణాలకు సరుకులు సరఫరా అవుతాయని అధికారులు ఆమెకు వివరించారు. రికార్డుల నిర్వహణ నిబంధనల మేరకు ఉండాలని, ఈ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంట పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, స్థానిక అధికారులు ఉన్నారు.



# పొదిలిలో శివాలయ తెప్పోత్సవ పనులు ప్రారంభం



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 12**

స్థానిక నిర్మ మహేశ్వర దేవస్థాన తెప్పోత్సవ పనులు ప్రారంభమయ్యాయి. శివరాత్రి మహోత్సవాల సందర్భంగా గురువారం నాడు ఆలయ కమిటీ సభ్యులు తెప్పోత్సవ పనులను ప్రారంభించారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గునుపూడి భాస్కర్, ఆలయ కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య ల ఆధ్వర్యంలో తెప్పోత్సవ పనులను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జి. సి. సుబ్బారావు, గునుపూడి మధు, భవాని శ్రీనివాస్, రాజా, నూతక్కి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఫిబ్రవరి 12**

బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామంలోని శ్రీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తనయుడు ముత్తుముల దివ్యేష్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ పూజారులు వేదమంత్రాల నడుమ అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు ఆలయపూజారులు, అభిషేకం అనంతరం శేషవస్త్రం , స్వామివారి తీర్థ ప్రదాలను అందించి వేదాశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యేష్ రెడ్డి నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి కోసం ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.

# ఎన్సిసిలో సెకండ్ ఆఫీసర్‌గా పదోన్నతి

**దొనకొండ ఫిబ్రవరి 12 పెన్ పవర్ :**

దొనకొండలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ ఫిజికల్ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న కాలే నరసింహ రావు 34 ఆంధ్ర బెటాలియన్ ఒంగోలు దార స్థానిక పాఠశాలలో 20 23లో ఎన్సిసి ఆర్మీ జూనియర్ 100 క్యాడేట్స్ ట్రూప్ నీ ఏర్పాటుచేసి ఎన్సిసి కెరిట కర్తా బాధ్యతలు తీసుకొని అనంతరం ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ నాగపూర్ కమిటీ లో శిక్షణ పొంది పాఠశాలలో ఎన్సిసి మూడవ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 11వ తేదీన సెకండ్ ఆఫీసర్ గా 34 ఆంధ్ర బెటాలియన్ ఆఫీస్ ఒంగోలు కబడ్డీ ఆఫీసర్ మోహన్ చేయడం జరిగింది. ఈ ర్యాంక్ పొందినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి రామాంజనేయులు మరియు తోటి ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.



# కందుకూరులో సార్వత్రిక సమ్మె విజయవంతం





**కందుకూరు పెన్ పవర్, ఫిబ్రవరి 12:**
దేశవ్యాప్య సారత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం నుండి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కార్మికులు కర్షకులు పోరాటం చేసి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ తీసుకుంటున్న నిర్ణయాలను అడ్డుకునేందుకు ఏఐటియుసి సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని వారు తెలిపారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం 26000 ఇవ్వాలని వారు కోరారు. కార్పొరేట్ వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తూ పని గంటలను పెంచుతుందని అన్నారు, గ్రామాలలో ప్రతి ఒక్కరికి పనిని కల్పించాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొని రావటం జరిగిందని అయితే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేసిందని దానిని తిప్పి కొట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందని వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులకు అంగన్వాడీ కార్యకర్తలకు ఆశా వర్కర్లకు ప్రతి ఒక్క కార్మికులకు పనికి తగ్గ వేతనం చెల్లించకుండా కాలం గడుపుతున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇలాగే వదిలేస్తే ప్రతి ఒక్క హక్కును కార్మికులు కోల్పోయే అవకాశం ఉందని, ఇప్పటికైనా కార్మికులు మేల్కొని తమ హక్కులను కాపాడుకునేందుకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. సమ్మెకు ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు మద్దతు పలికి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కే మురళి, వై ఆనందమోహన్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటీయూసీ నాయకులు బొల్లోజుల బాల బ్రహ్మాచారి, ఏఐటీయూసీ అనుబంధ పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జమ్మలమడుగు.రవి, కంకణాల చిన్న బ్రహ్మయ్య, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవణమ్మ, నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఉప్పుటూరి మాధవరావు, బొజ్జ చంద్రమోహన్, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, సిపిఎం మాజీ కౌన్సిలర్ నాదెండ్ల కోటేశ్వరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ గౌస్, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కె మున్వర్ సుల్తానా, డి రామ్మూర్తి, టి వెంకట్రావు, ఎస్ పవన్ కుమార్, సిఐటియు పట్టణ నాయకులు సల్మా, మహేష్, డి ఎం రాయుడు, ఎం ప్రసాద్, ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎం పద్మ, ఎస్ కే మల్లికా, ఎస్కే షాహిదా, మహబూబ్ జాన్, మున్సిపాలిటీ నాయకులు దార్ల శేషమ్మ, వడ్డె ముక్కుల రవణమ్మ, ఎద్దు కొండమ్మ, అంగన్వాడి అధ్యక్షులు రాజేశ్వరి, కార్యదర్శి రహమతునిస, కేశవ, కుమారి మస్తానమ్మ, ఆశా నాయకులు వసుంధర, కృష్ణవేణి, ఝాన్సీ, ఆర్టీసీ నాయకులు డి రమణయ్య, వేమూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

## పొదిలి ఆర్టీసీ డిఎం శంకర్రావు వెల్లడి



**పొదిలి, పెన్ పవర్, ఫిబ్రవరి 12**
మహాశివరాత్రి సందర్భంగా పొదిలి ఆర్టీసీ డిపో నుండి వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ వి శంకరరావు చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పొదిలి డిపో నుండి శ్రీశైలం, రామతీర్థం, కోటప్పకొండ, త్రిపురాంతక క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డి ఎం చెప్పారు. అదేవిధంగా ఆయా పుణ్యక్షేత్రాలకు దర్శి, దొనకొండ గ్రామాల మీదుగా కూడా ప్రత్యేక బస్సుల్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. అలాగే ఈ నెల 14, 15వ తేదీల్లో పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా పొదిలి డిపో నుండి రెండు ప్రత్యేక బస్సులను రెండు రోజులపాటు అర్ధరాత్రి వరకు నడుపుతున్నట్లు డిఎం తెలిపారు ఈ ప్రయాణ సౌకర్యాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని డిపో మేనేజర్ శంకరరావు కోరారు.

# ప్రణాళికాబద్ధంగా చదివితే విజేతలుగా నిలుస్తారు

## జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాజ్ భాష





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**
ప్రణాళికాబద్ధంగా చదివితే విజేతలు మీరేనని జనవిజ్ఞానానికి జాతీయ ఉపాధ్యక్షుడు షేక్ గయాస్ భాష అన్నారు మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూలుకు విచ్చేసిన ఆయన టెన్త్ క్లాస్ విద్యార్థినే విద్యార్థులకు మోటివేషన్ క్లాసు ఇవ్వడంలో భాగంగా అందరూ బాగా చదవాలని రోజుకి 16 గంటలపాటు తప్పనిసరిగా చదివే మీద దృష్టి పెట్టాలని మంచి నిద్ర కూడా ఉండాలని ఒక ప్రణాళికని రూపొందించుకొని చదువుకుంటే మంచి మార్కులు వస్తాయని ఆయన సూచించారు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని టీవీలో సినిమాల పట్ల ఆసక్తి తగ్గించుకోవాలని చదువు మీద దృష్టి పెడితే గొప్ప స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందుతారని ఆయన అన్నారు అదేవిధంగా గురువులు చెప్పినటువంటి మాట విని అనుసరించాలని ఆయన అన్నారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లేటప్పుడు ఆందోళన చెందవద్దని ధైర్యంగా వెళ్లి పరీక్షలు రాయాలని ఆయన సూచించారు కేజీబీవీ స్కూల్ లో జరుగుతున్నటువంటి విద్యార్థులు మంచి ఉన్నతమైనటువంటి స్థాయిలో ఉన్నారని అలాగే మీరు కూడా మంచి స్థాయికి రావాలని దానికి ఏకైక మార్గం చదువు మీద దృష్టి పెట్టడమేనని భాష విద్యార్థులకు సూచించారు. జేబీవీ ఉపన్యాస పోటీలో రెండో బహుమతి పొందిన కేజీబీవీ విద్యార్థినీని ప్రిన్సిపాల్ , షేక్ రేష్మ షేక్ గయాజ్ భాషా అభినందించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, కేజీబీవీ సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

# జిందాల్ సంస్థకు ఐరన్ ఒర్

## జిల్లా కలెక్టర్ పి రాజ బాబు





**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ ఫిబ్రవరి 12**
జిల్లాలో ఐరన్ ఒర్ తవ్వకాలకు జిందాల్ సంస్థకు భూములు కేటాయించడానికి సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజబాబు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని ఆయన చాంబర్ లో జిందాల్ సంస్థకు ఐరన్ ఓర్ తవ్వకాలకు భూము ల కేటాయింపుపై జిల్లా కలెక్టర్ జిందాల్ సంస్థ ప్రతినిధులు, అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలేటివారి పాలెం, లింగసముద్రం మండలాలలో జిందాల్ సంస్థ ఐరన్ ఒర్ త్రవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని ఆయన చెప్పారు. ఐరన్ ఓర్ త్రవ్వకాలకు వలేటి వారిపాలెం మండలం మరియు లింగసము ద్రం మండలాలలో 5000 ఎకరాల భూములు కావసి ఉందని ఆయన చెప్పారు. అద్దంకివారిపాలెం, లక్ష్మక్కపల్లి గ్రామాలలో 1340 హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయ ని వాటినిమార్పిడి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధి కారులకు చెప్పారు. ఐరన్ ఓర్ బ్లాక్స్ వద్ద మొక్కలు నాటడానికి మరో 1500 ఎకరాలు భూములు అవసరం అని చెప్పారు. ఈ సమావేశంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి వినోద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ.ఇ విజయ మోహన్, జిందాల్ సంస్థ ప్రతి నిధులు కిరణ్, లింగసముద్రం తహసిల్దార్ హుస్సేన్, వలేటివారిపాలెం తహసిల్దార్ హనుమాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భైరవకోనలో భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు కొత్త మార్గదర్శకాలు

## భక్తులందరూ సహకరించాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రం భైరవకోనలో మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో వివరించారు.దేవాదాయ శాఖ మరియు కనిగిరి శాసనసభ్యులు, జిల్లా టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనలు ఆదేశాల మేరకు మేరకు మహాశివరాత్రి సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని, సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం త్వరితగతిన పూర్తయ్యేలా కొత్త నిబంధనలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.నూతన నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సామాన్య భక్తులకు మాత్రమే దర్శనం కల్పించబడుతుంది. ఈ సమయాల్లో ఎటువంటి వీఐపీలు, ప్రముఖులు, స్థానికులు ప్రత్యేక సౌకర్యాలు పొందకుండా క్యూలైన్లోనే దర్శించుకోవాల్సి ఉంటుంది. వీఐపీలు, ప్రముఖులు, స్థానిక గ్రామాల భక్తులు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు మరియు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే దర్శనం చేసుకోవాలని సూచించారు అదేవిధంగా సామాన్య భక్తులకు ఎక్కువ సమయం కేటాయించేందుకు కుంకుమార్చన అభిషేకాలు ఇతర ఆర్జిత సేవలను ఎక్కువ జామున మరియు రాత్రి వేళల్లో మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ ఆలయ అధికారులకు సిబ్బందికి భక్తులు సహకరించాలని కోరారు.

# వైసీపీ వారిపై పోలీసుల వేధింపులు ఆపాలి: బుర్రా



**గుడ్లూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 12:**
మండలంలోని చేవూరు గ్రామ చెరువు నుండి ఇండో సోల్ కంపెనీకి వెళుతున్న వాటర్ పైపులైన్ ను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల కొన్ని రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో తగులబెట్టారు. ఈ వాటర్ పైపుల దహనం కేసు సంబంధించి పోలీసులు వైసీపీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేసి, విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం ఆపాలని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ బుర్రామధుసూదన్ యాదవ్ అన్నారు. గురువారం బుర్రా చేవూరు గ్రామానికి వెళ్లి వేధింపులకు గురవుతున్న నక్కల శరత్ మరియు కళ్యాణ్ మరియు చేవూరు గ్రామ బాధితులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు భరోసాను ఇచ్చారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ మాట్లాడుతూ ఇలా ఒకవైపు పార్టీ వారిని వేధించడం మంచి పద్ధతి కాదని, పదే పదే విచారణ పేరుతో పిలిపించి మానసిక వేదనకు గురిచేయడం అన్యాయమన్నారు. పోలీసు అధికారులు జరిగిన సంఘటనలపై సక్రమమైన విచారణ చేపట్టి, నిజమైన బాధితులను శిక్షించాలని అన్యాయంగా విచారణ పేరుతో వైయస్సార్సీపి నాయకుల, కార్యకర్తలపై వేధింపులు ఆపాలని మాజీ శాసన సభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. అనంతరం ఈ విషయంపై స్థానిక ఎస్సై వెంకట్రావుతో బుర్రా చర్చించి, వాస్తవ విచారణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బుర్రాతో పాటు స్థానిక నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోవిలంపాడు గ్రామంలో ట్రాన్స్ఫారం పై దొంగల యత్నం



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 12**
మండలంలోని కోవిలంపాడు గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్ఫారాన్ని లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి యత్నించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నన్నసాని గుంటయ్య పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్ఫారాన్ని దుండగులు దిమ్మెపై నుంచి దించి, అందులోని ఆయిల్ ను దొర్లించి, నట్లు ఊడదీసి లోపలి భాగాలను పరిశీలించి, ట్రాన్స్ఫారంలో ఉన్న తీగలను దొంగలించాలని ప్రయత్నించినప్పటికీ, అందులోని వైరు అమ్మితే ఎక్కువ డబ్బులు రావని భావించి వాటిని అక్కడికక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఉదయం దారిన వెళ్ళిన గ్రామస్తులు ట్రాన్స్ఫారం నేలపై పడివుండటాన్ని గమనించి ఈ ఘటనపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com